క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



లారీపై ఎగుమతి చేస్తున్న ధాన్యం

సీతానగరం: మండలంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మిర్తిపాడు ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా బుధవారం ఉండేశ్వరపురం, మిర్తిపాడు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. తమ్మిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, బొల్లి వేణుగోపాలకృష్ణ, నాగోతు చంద్రశేఖర్, పోలిన రవీంద్ర, మద్దుకూరి శ్రీనివాస్‌లకు చెందిన 5.50 టన్నులను కొనుగోలు చేశారు. మిర్తిపాడు వీఏఏ నందిని, ఉండేశ్వరపురం వీహెచ్ఏ దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నలగడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా ప్రజలు స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు పొందుతున్నారన్నారు. అధ్యాపకుడు ఎ.వెంకటేష్ విద్యార్థులతో భారత రాజ్యాంగ పీఠికను చదివించి, భారత సార్వభౌమాధికారానికి అనుగుణంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. లెక్చరర్లు నాగేశ్వరరావు, వీవీ సుబ్బారావు, వై.ఫణీంద్ర కుమార్, ఎం.సుధామయి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

నేడు గాయత్రీ హోమం, కార్తిక అన్నసమారాధన

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం గాయత్రీ హోమం, అన్నసమారాధనలు జరుగనున్నాయి. రామానందస్వామి దివ్య ఆశీసులతో ఆయన శిష్య పరివార్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 11 యజ్ఞ కుండీలను ఏర్పాటు చేసి, 44 జంటలచే ఉదయం 8.30 గంటల నుంచి గాయత్రీ హోమం నిర్వహిస్తారు. ఉదయం 11 నుంచి ఆలయం పక్కనే ఉన్న మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అన్నసమారాధనను జరుగుతుంది. గాయత్రీ హోమంలో పాల్గొనే వారికి ఆలయంలోనే హోమద్రవ్యాలను ఉచితంగా అందజేస్తారు.


ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్లను అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి

బిక్కవోలు: పందలపాకలో ఉజ్వల్ పథకంలో భాగంగా మంజూరైన కేంద్ర ప్రభుత్వ ఉచిత గ్యాస్ కనెక్షన్లను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. రాయవరానికి చెందిన కార్తికేయ గ్యాస్ ఏజెన్సీ ద్వారా లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్, స్టవ్ తదితర సామగ్రిని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, పడాల అబ్బులరెడ్డి, రొంగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



వెదురుపాకలో భక్తాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని వెదురుపాకలో భక్తాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కొరిపల్లి అప్పలస్వామి, సత్యవేణి దంపతులు ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. తొలుత పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామస్తులతో పాటు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు.

ఇంటింటా విద్యుత్ కాంతులు

- నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు
- ఎమ్మెల్యే రాజా చొరవతో వేగంగా పనులు
- తీరనున్న లోవోల్టేజ్ సమస్యలు



వెలుగుబందలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్

రాజానగరం: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చొరవతో నియోజకవర్గంలో ప్రజలందరికీ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడింది. లోవోల్టేజ్ తదితర సమస్యలు లేకుండా ఆయన అన్ని విధాలా చర్యలు తీసుకున్నారు. అవసరమైన ప్రతిచోటా విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. జగన్ సర్కారు కూడా ఈ విషయాన్ని గ్రహించి, ఏపీఈపీడీఎల్ తోడ్పాటుతో ఎమ్మెల్యే ప్రతిపాదనల మేరకు విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తోంది.

ఆరు విద్యుత్ స్టేషన్ల ఏర్పాటు

నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో ప్రజల విద్యుత్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ని అందించేలా గడచిన నాలుగున్నరేళ్లలో కొత్తగా ఆరుచోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించారు. దివాన్ చెరువు పంచాయతీ పరిధిలోని వేపాలదిబ్బ ప్రాంతంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.40.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వీటిలో ఒకటి కాగా, ఇదే అత్యధిక వ్యయంతో కూడినది కూడా. దీని ద్వారా రాజానగరం, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్ మండలాలు వేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. గృహ అవసరాలతో పాటు పారిశ్రామిక ప్రగతికి తోడ్పడుతుంది. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను 9 గంటల పాటు అందించవచ్చు. రాజానగరం మండలం వెలుగుబంద, రాధేయపాలేల్లో రూ.7.64 కోట్ల నిధులతో రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. వీటితో వెలుగుబందలోని జగనన్న కాలనీలో 11,300 గృహావసరాలతో పాటు ఆయా ప్రాంతాల ప్రగతికి ఉపయోగపడుతుంది. కోరుకొండ మండలం నరసాపురంలో రూ.3.5 కోట్లు, సీతానగరం మండలం చినకొండేపూడిలో రూ.3.68 కోట్లతో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులు పూర్తికావొచ్చాయి. వీటితో పాటు కాటవరంలో రూ.3.8 కోట్లతో మరొక విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు.

వేగంగా పనులు



నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ లోవోల్టేజ్ సమస్య రాకుండా, ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ని అందించాలనేదే నా సంకల్పం. దీనికి ప్రభుత్వ పరంగా కూడా తోడ్పాటు లభించడంతో మూడు మండలాలలో ఆరుచోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అనుమతులతో పాటు నిధులు సమకూర్చాం. వేపాలదిబ్బ, రాధేయపాలెం, వెలుగుబందలో ప్రారంభోత్సవాలు చేయగా, నర్సాపురం, చినకొండేపూడి, కాటవరాల్లో పనులు వేగంగా జరుగుతున్నాయి.
– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం



ధనలక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న జక్కంపూడి గణేష్ తదితరులు

సీతానగరం: వంగలపూడిలో అనారోగ్యం బాధపడుతున్న ముగ్గురికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆర్థిక సాయం అందించారు. వంగలపూడిలో మంగళవారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ముప్పిడి అప్పారావు కుమార్తె ధనలక్ష్మి క్యాన్సర్‌తో బాధ పడుతుండగా రూ.20 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న గారపాటి శివ కుమారుడు తనీష్‌కు, ఇందుగుమిల్లి రామకృష్ణకు రూ.15 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి అంబటి రమణ, పార్టీ నాయకులు కొంచ భాస్కరరావు, చల్లమళ్ల సుజీరాజు, పేరిచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



కాపవరంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ రొంగల పద్మావతి

బిక్కవోలు: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ రొంగల పద్మావతి అన్నారు. బుధవారం కాపవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ మారెళ్ల భీష్ముడు, వైఎస్సార్‌సీపీ జేఏసీ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, ఈవోపీఆర్డీ భవాని తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమని ఎంపీపీ కేతా తులసి అన్నారు. కాండ్రేగులలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద సంక్షేమ అభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా తులసి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ పేపకాయల వెంకటరమణ, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, ఉప సర్పంచ్ సాంబత్తుల సూర్యనాగమణి, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సాంబత్తుల చంటి తదితరులు పాల్గొన్నారు.

పేదల రాత మార్చేది అక్షరాస్యతే

- రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు
- జెడ్పీ ఉన్నత పాఠశాల భవన సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి



ఉన్నత పాఠశాల భవన సముదాయం ప్రారంభోత్సవానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు సత్తి సూర్యనారాయణరెడ్డి, జక్కంపూడి రాజా

అనపర్తి: పేదల తలరాతలు మార్చేది చదువొక్కటే అని, అక్షరాస్యత లేని సమాజం అభివృద్ధి సాధించలేదని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు అన్నారు. అనపర్తిలో రూ.3.26 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన సముదాయాన్ని మంత్రి అంబటి రాంబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదింటి పిల్లలు సైతం ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2024 ఎన్నికల మహా సంగ్రామంలో ఎంతమంది ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనపర్తి నియోజకవర్గం వైఎస్సార్ సీపీకి కంచుకోట అన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడకుండా అవసరమైతే సొంత నిధులు వెచ్చించి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వైఎస్సార్ సీపీలో ఉన్నందుకు గర్విస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో తనను రికార్డు మెజార్టీతో గెలిపించారన్నారు. నీతి, నిజాయితీలతో పనిచేస్తూ ప్రజల రుణాన్ని తీర్చుకుంటున్నానని చెప్పారు. కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతి రహితంగా పారదర్శక పాలన అందిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించారని కొనియాడారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో కళావేదిక నిర్మాణానికి తన సొంత నిధులు రూ.20 లక్షలు వెచ్చించిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి పాల్గొని ఓపెన్ ఆడిటోరియంను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, నేషనల్ వెంకటరెడ్డి, సబ్బెళ్ల అమ్మిరెడ్డి, తేతల ఉపేంద్రరెడ్డి, తేతలి రాధాకృష్ణారెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి, కర్లాటక త్రినాథరెడ్డి, నల్లమిల్లి బుల్లిమోహన్‌రెడ్డి, సత్తి వెంకటరామారెడ్డి, సత్తి రామారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి ధర్మారెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, కోనాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన



జి.మామిడాడలో కార్తిక వన సమారాధన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



గోకవరంలో వనభోజనాలు చేస్తున్న భక్తులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో చాంబర్ కామర్స్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక వన సమారాధనలు ఐక్యతకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కర్రి శ్రీనివాసరెడ్డి, వెలగల తిరపారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధన

గోకవరం: స్థానిక శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామ శివారులోని మామిడి తోటలో ఉసిరి చెట్టుకు సామూహిక పూజలు నిర్వహించారు. సంఘం సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యాన్సీ హౌసీ, కపుల్ గేమ్స్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సామర్థ్యాలు పెంపొందించేలా బోధన సాగాలి



రంగంపేట ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న గౌరీశంకర్

రంగంపేట: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించేలా ఉత్తమ విద్యా బోధన చేయాలని జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానటరింగ్ అధికారి ఎ.గౌరీశంకర్ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన రంగంపేట, ఈలకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు రంగంపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాల సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు, వి.పార్థసారథిల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్ బాలకృష్ణ, కామేశ్వరరావు, రాజా, ధర్మరాజు, రాంబాబు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా సామగ్రితో అధికారులు

రాజానగరం: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మండల ప్రత్యేకాధికారి పి.వీణాదేవి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా మహోత్సవంలో భాగంగా గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో వచ్చే నెల 15 నుంచి 20 వరకూ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనే వారి వయసు 15 ఏళ్లు పైబడి ఉండాలన్నారు. క్రీడా పోటీలు గ్రామ సచివాలయం స్థాయిలో వచ్చే నెల 15 నుంచి 20 వరకూ, మండల స్థాయిలో 21 నుంచి జనవరి 4 వరకూ, నియోజకవర్గ స్థాయిలో 5 నుంచి 10 వరకూ, జిల్లా స్థాయిలో 11 నుంచి 21 వరకూ, రాష్ట్ర స్థాయిలో 22 నుంచి 25 వరకూ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామనదొర, జ్యోతిప్రసాద్, పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పేటతుళ్లి

పెదపూడి: జి.మామిడాడలో అయప్పస్వామి భక్తులు పేటతుళ్లి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయం వద్ద మేళతాళాలు, డప్పుల వాయిద్యాలు, భక్తుల నృత్యాలతో ఊరేగింపు ప్రారంభించారు. గ్రామ పురవీధిల్లో అయ్యప్ప స్వామిని ఊరేగించారు. భక్తులు ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఎన్నో ఉపయోగాలు



ఫిజియోథెరపీ వల్ల ఉపయోగాల్ని వివరిస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్

రంగంపేట: శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఫిజియోథెరపీ వైద్యం ఎంతో ఉపయోగపడుతుందని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు సూచించారు. బుధవారం రంగంపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఫిజియోథెరపీ ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఒత్తిడిని జయించి ప్రశాంత జీవన గమనానికి ఫిజియోథెరపీని ఉపయోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎ.సంతోష్‌కుమార్ ఫిజియోథెరపీ ఉపయోగాల్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో రంగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి, మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా కేసులో ఒకరికి రిమాండ్

రంగంపేట: సారా కేసులో ఒకరికి రిమాండ్ విధించినట్టు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చినదొడ్డిగుంటలో సారా విక్రయిస్తున్న కారి లక్ష్మణరావును అరెస్ట్ చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారన్నారు. నిందితుడిని పెద్దాపురం సబ్ జైలుకు తరలించారన్నారు.

శిక్షణ కేంద్రాలుగా స్కూల్ కాంప్లెక్స్‌లు

ప్రకాశం నగర్: ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లు శిక్షణ కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను బుధవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో ఎప్పటికప్పుడు తీసుకువస్తున్న మార్పులను కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చించడం జరుగుతుందన్నారు. వాటిని ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని పాఠశాల స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలలో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ ఎస్.రాజా ప్రశాంత్, కార్యదర్శి పరస జగన్నాథరావు, సీఆర్పీ జయంతి శాస్త్రి, కోటేశ్వరి పాల్గొన్నారు.


అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన



మంత్రి అంబటి రాంబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, విజయలక్ష్మి, రైతులు

మధురపూడి: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన జరుగుతోందని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాతో కలిసి బుధవారం కోరుకొండ మండలం కాపవరంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తొర్రిగెడ్డ కాలువపై రివర్స్ పంపింగ్ స్కీమ్, కోరుకొండ మండలంలో 38 కోట్ల రూపాయల నిధులతో 53 అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగిందన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి, మరో రూ.వెయ్యి కోట్లతో సంక్షేమ పథకాలను అమలు జరిపినట్టు తెలిపారు. అలాగే 20 వేల మందికి పట్టాల పంపిణీ చేశామన్నారు. ఎంఎస్ఈ – సీడీపీ నిధులతో రాజానగరం మండలం కలవచర్లలో నూతన పారిశ్రామిక వాడ నిర్మాణంతో నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. దీనికి తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారన్నారు. పార్టీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్బీకే, సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, బల్క్ మిల్క్ కేంద్రాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, సీతానగరం కన్వీనర్ గంటా శ్రీను, ఎంపీపీ గుర్రాల జోత్స్న, పార్టీ నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, డాక్టర్ బాబు, పృథ్వీరాజ్, కంటే వినయ్‌తేజ, కొండపల్లి దుర్గారావు, మద్దాల రమణ, మండపాక శ్రీను. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ రుణాలపై అవగాహన



సహకార బ్యాంకులో జీరో అకౌంట్ ఖాతా కోసం పత్రాలు అందజేస్తున్న రైతులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో బుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆపరేటివ్ బ్యాంకు గోకవరం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార బ్యాంకు ద్వారా మూడు రకాల రుణాలు ఇస్తారన్నారు. కేసీసీ ద్వారా రుణాలు తీసుకుని సంవత్సరం లోపు తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీ వస్తుందన్నారు. దీర్ఘకాలిక రుణాల్లో రైతు నేస్తం కింద ఎకరానికి రూ.8 లక్షల రుణం ఇస్తారన్నారు. అలాగే డ్వాక్రా రుణాలు, గోల్డ్ రుణాలు కూడా ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ సహకార బ్యాంకులో జీరో అకౌంట్ ప్రారంభించి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు రైతులకు అకౌంట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, విశాల సహకార పరపతి సంఘం డైరెక్టర్ తొట్టా సత్యానారాయణ, స్థానిక నాయకులు డి.వెంకటరత్నం, శివ, కో ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది కె.ప్రదీప్‌చంద్ర, బి.శ్వేత, శ్రీనివాస్, అప్పన్నదొర, రైతులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి



గోకవరంలో ఆడుదాం ఆంధ్రా పోటీల లోగోను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు

గోకవరం: క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడల లోగోను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో 15 నుంచి 35 సంవత్సరాల లోపు వారు పాల్గొనవచ్చాన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో క్రీడా పోటీలకు సంబంధించి కమిటీలు ఏర్పాటు చేస్తారన్నారు. సచివాలయ స్థాయిలో డిసెంబర్ 15 నుంచి 20, మండల స్థాయిలో డిసెంబర్ 21 నుంచి జనవరి 4 వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, మెహర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.